ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 18 మార్చి 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (సోమ)
సహరి : 4:47 (మంగళ)

ఎన్నికల విధులకు వలంటీర్లు దూరం!





భీమవరం, మార్చి 17 : జిల్లాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉన్నదని ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికలు - 2024 షెడ్యూలును విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణపై ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వలంటీర్‌కు ఎలాంటి విధులను అప్పగించడం లేదు. ఎక్కడైనా ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వలంటీర్లు సహకరిస్తున్నారనే విషయం మా దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. షెడ్యూలు ప్రకటించిన తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అన్ని రాజకీయ పార్టీలు, పోటీలోనున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదు. సభలు, సమావేశాలు, వాహనాలు అన్ని ముందస్తు అనుమతి పొంది నిర్వహణలో ఉంచుకోవాలి. ఎన్నికల నేపథ్యంలో ప్రతి అభ్యర్థి, రాజకీయ పార్టీ ప్రతినిధి ప్రశాంత వాతావరణానికి ఎలాంటి భంగం వాటిల్లకూడదు. బహిరంగ ప్రదేశాలు ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్తించిన ఫొటోలు, బ్యానర్లు తొలగిస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్తించిన ఫొటోలను, పోస్టర్లను ఫ్లెక్సీలు, బ్యానర్లను 24 గంటల్లో తొలగించడానికి చర్యలు చేపట్టాం. 48 గంటల్లో బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలను వస్త్రాలతో కప్పడం, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించడంతోపాటు. 72 గంటల్లో ప్రైవేటు కార్యాలయాల్లో, ప్రాంతాల్లో ఫ్లెక్సీ, పోస్టర్లను, బ్యానర్లను తొలగించే చర్యలు చేపడుతున్నాం.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

బహిరంగ ప్రదేశాల్లో నిర్దేశిత సమయంలోగా వాల్ రైటింగ్‌లు, జెండాలను, వాల్ పోస్టర్లు, రాతలను తొలగిస్తున్నాం. ఎన్నికలలో మూడు బెటాలియన్లను వినియోగిస్తాం. వీరికి అదనంగా 1,500 మంది పోలీస్ సిబ్బందికి విధులను కేటాయిస్తున్నాం. ఎన్నికల వ్యయ పరిమితులకు సంబంధించి ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ. 40 లక్షలు మించి ఖర్చు చేయరాదు' అని వివరించారు. అలాగే..

- వికలాంగులు (పీడబ్ల్యూడీ) 85 ఏళ్లు, అంతకుమించి ఎక్కువ వయసున్న ఓటర్లు ఇప్పుడు వారి ఇళ్ల నుంచి ఓటు వేసే అవకాశం కల్పించాం.
- జిల్లాలో నియమించబడిన మీడియా టీమ్, వీడియో గ్రాఫర్లు, పొలిటికల్ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల విధులకు సంబంధించి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం.
- ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న, నామినేషన్ల స్వీకరణకు చివరి తేది 25, నామినేషన్ల పరిశీలన 26, ఉపసంహరణ 29, పోలింగ్ మే 13, ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీ జరుగుతాయి.
- జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక్కడ 14,61,337 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,16,955, మహిళలు 7,44,308, థర్డ్‌జెండర్ 74 మంది ఉన్నారు.

- ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తే చర్యలు తప్పవు
- ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్.. మే 13న పోలింగ్
- ప్రజాస్వామబద్ధంగా ఎన్నికల పక్రియ నిర్వహణ
- నరసాపురం పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 14,61,337
- మొత్తం పోలింగ్ స్టేషన్లు 1,463.. సమస్యాత్మక కేంద్రాలు 298
- ఎన్నికల నిర్వహణకు 9,681 మంది ప్రిసైడింగ్ అధికారులు
- భీమవరంలో రెండుచోట్ల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ నెంబర్ 08816-299616
- విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లాలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 1,463 ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో పట్టణ ప్రాంతాల్లో 374, గ్రామీణ ప్రాంతాల్లో 1,089 ఉన్నాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 298, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు మూడు ఉన్నాయి. వీటికి వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించాం.

- ఎన్నికలకు 9,681 మంది ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందిని నియమించాం. నియోజకవర్గానికి మూడు చొప్పున 28 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, 19 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 38 వీడియో నిఘా బృందాలు, ఏడు వీడియో వీక్షణ బృందాలు, ఏడు అకౌంటింగ్, వ్యయ బృందాలను ఏర్పాటు చేశాం.

పోర్టర్లు.. యాప్స్

- ప్రజలకు, రాజకీయ పార్టీలకు ఎన్నికల ఫిర్యాదులు, ప్రశ్నలను దాఖలు చేయడానికి ఉపయోగించే పోర్టల్స్. మోడల్ ప్రవర్తనా నియమావళి, వ్యయ ఉల్లంఘనలు మరియు ఇతర ఏవైనా ఉల్లంఘనలను నివేదించడానికి సి-విజిల్ యాప్‌ను ఉపయోగించవచ్చు.అభ్యర్థులు మరియు రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు, ఇతర ప్రచార-సంబంధిత కార్యకలాపాలకు అనుమతుల కోసం సువిధ యాప్‌ను వినియోగించాలి. ఓటర్ల నమోదు స్థితి, పోలింగ్ స్టేషన్ వివరాలను ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ అందిస్తుంది. రిజిస్ట్రేషన్లు, కరెక్షన్స్ కోసం ఆన్‌లైన్ ఫారమ్స్‌ను దీనిద్వారా సమర్పించవచ్చు. పోటీలో ఉన్న అభ్యర్థుల గురించి సవివరమైన సమాచారాన్ని పొందేందుకు కేవైసీ యాప్ ఉపయోగపడుతుంది.
- **ఫిర్యాదులు చేసేందుకు :** నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ : 1950, ఎంసీసీ ఓటర్ హెల్ప్‌లైన్ : 08816-299618, ఎన్నికలకు ఎప్పటికప్పుడు సమాచారం, సేవల కోసం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. నెంబరు 08816-299616, ఈఎస్ఎంఎస్, సువిధ 08816-299617, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు.
- **కౌంటింగ్ కేంద్రాలు :** భీమవరం విష్ణు కాలేజీలో నరసాపురం, ఆచంట, పాలకొల్లు, తణుకు నియోజక వర్గాలకు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం.

అధికార పార్టీ నేత...
మందుచూపు

- ఐదు బార్‌ల నుంచి 1,500 కేసులు తీసుకున్న వైనం
- అంతా ఉచితమే.. ఐదేళ్లు అండగా ఉన్నానంటూ యజమానులపై ఒత్తిడి
- గ్రామాలు, వార్డులకు తరలింపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



జిల్లాలో ఓ అధికార పార్టీ నేత ముందుచూపు ప్రదర్శిం చారు. ఎన్నికల్లో మందు సరఫరాకు సన్నాహాలు చేసుకు న్నారు. బార్‌ల నుంచి ఉచితంగా మద్యం కేసులను తీసు కున్నారు. ఐదేళ్లపాటు బార్‌లకు అండగా ఉన్నానంటూ బార్ యజమానులపై ఒత్తిడి తెచ్చారు. తనకు అను కూలంగా ఉన్న ఐదు బార్‌ల నుంచి ఏకంగా 1500 మద్యం కేసులను తీసేసుకున్నారు. ఒక్కో కేసులో 48 క్వార్టర్ మద్యం సీసాలుంటాయి. అంటే 72 వేల మద్యం బాటిళ్లు భద్రపరచుకున్నారు. అంతా ఉచితమే. బార్‌లలో అధిక ధరలకు విక్రయించుకున్నా సరే అధికారులు ఏమీ చేయకుండా ఎమ్మెల్యే అండగా ఉన్నారు. వాస్తవానికి బార్‌లలో క్వార్టర్ బాటిళ్లు బయటకు విక్రయించడానికి లేదు. బ్రాండెడ్ రకాలను బార్‌లకు సరఫరా చేసేవారు. దీంతో మద్యం ప్రియులు బార్‌లలో కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ఫలితంగా బార్ యజమానులు ఒక్కో క్వార్టర్‌పై అదనంగా రూ.50 పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. అధికారులు ఈ విషయమై ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. బార్ నిర్వాహకులకు అధికార పార్టీ అండదండలున్నాయి. దానిని జిల్లాలోని ఆర్థికంగా సంపన్నమైన పట్టణంలోని అధికార పార్టీ నేత తన స్వప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. ఐదేళ్లు అండగా ఉన్నానంటూ యజమానులపై ఒత్తిడి తెచ్చారు. ఉచితంగా మద్యం బాటిళ్లను తీసుకున్నారు. బార్ యజమానులు సైతం తమ కృతజ్ఞతను చాటుకున్నారు. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేత ఇలా ముందు చూపుతో వ్యవహరించారు. అదే నియోజకవర్గంలో ఇప్పుడు కూటమి నుంచి జనసేన అభ్యర్థి రంగంలో ఉన్నారు. కూటమిని ఎదుర్కోవాలన్న ఉద్దేశంతో మద్యం ఏరులై పారించేందుకు సిద్ధపడ్డారు. బార్‌ల నుంచి తీసుకున్న బాటిళ్లను గ్రామాలు, వార్డుల వారీగా చేరవేసి నట్టు సమాచారం. కోడ్‌కు ముందే బార్‌ల నుంచి పెద్ద మొత్తంలో మద్యాన్ని దాటించి ముందుచూపుతో వ్యవహరించారు. సదరు నియోజకవర్గంలో ఇప్పుడిదే విషయం చర్చనీయాంశంగా మారింది.

నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

భీమవరం, మార్చి 17 : సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం విజయవాడ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత తీసుకున్న చర్యల గురించి ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 24 గంటలలోగా ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డిం గులు, బ్యానర్లు, జెండాలు వంటివన్నీ ఇప్పటికే తొలగించి ఉండాలని, వివిధ పబ్లిక్ ఆస్తులైన బహిరంగ ప్రదేశాలు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయ పరమైన ప్రకటనలు, గోడపై రాతలు, పోస్టర్లు, కటౌట్లను వెంటనే తొల గించాలని ఆదేశించారు. సి-విజిల్ మానిటరింగ్, ఫిర్యాదుల సత్వర పరిష్కారం, వార్తాపత్రికల లోని ప్రధాన ఫిర్యాదులు, 24గంటల్లో తీసుకున్న చర్యలు, ఫిర్యాదుల నిర్వహణ అప్లికేషన్, నివేదిక నిర్వహణ, వాటి స్థితి నివేదికలను ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. రోజువారీ నివేదికలను ఎప్పటికప్పుడు చేరవేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, పాలకొల్లు నియోజక వర్గ ఆర్వో బి.శివనారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటే శ్వరరావు, ఎలక్షన్స్ సూపరిటెండెంట్ సి.హెచ్.దుర్గా ప్రసాదు పాల్గొన్నారు.

కోడ్ అమలుపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలు కఠినంగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. వలంటీర్లు రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై నిఘా పెట్టాలన్నారు. బియ్యం పంపిణీ వాహనాలపై, నీటి ట్యాంకర్లపై స్టిక్కర్లను తొలగించాలన్నారు.





అమ్మవారికి పాలపొంగళ్లను నైవేద్యంగా తీసుకెళ్లుతున్న మహిళలు.. ప్రత్యేక అలంకరణలో పెద్దింటమ్మ

భక్తులతో పోటెత్తిన పెద్దింటమ్మ ఆలయం

కైకలూరు, మార్చి 17 : కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఉత్సవాల్లో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం నాటికి 7వ రోజుకు చేరాయి. ఎక్కడ చూసినా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మహిళలు కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లల్లో పాలపొంగళ్లను పొంగించి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. చిన్నపిల్లలకు ఉచితంగా పాలును గణపవరానికి చెందిన పిన్నమరాజు వెంకట సీతారామరాజు, సునీత దంపతులు అందజేశారు. కైకలూరు రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించగా కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.



ఆల్ ద బెస్ట్

నేటినుంచి పదో తరగతి పరీక్షలు

- 127 పరీక్ష కేంద్రాలు... 27,426 విద్యార్థులు
- ఒత్తిడి వద్దంటున్న ఉపాధ్యాయులు

భీమవరం రూరల్, మార్చి 17 : పాఠశాల విద్యలో విద్యార్థి భవిష్యత్తుకు తొలిమెట్టుగా పరిగణించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 127 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 21,341 మంది, గత పరీక్షలలో తప్పినవారు 6,085 మంది మొత్తంగా 27,426 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9:30 నిమిషాల నుంచి 12:45 నిమిషాల వరకు పరీక్ష నిర్వహిస్తారు. జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే 93467 26024 నెంబరులో సంప్రదించవచ్చు. అన్ని పరీక్షా కేంద్రాలను 'నో మొబైల్ జోన్' గా ప్రకటించారు. సిబ్బంది ఎవరైనా సెల్‌ఫోన్ తెస్తే పరీక్షకేంద్రం గేటువద్ద పోలీసులకు స్వాధీనం చేయాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద జనం గుంపులుగా ఉండకుండా 144వ సెక్షన్‌ను విధించారు.



కలవపూడిలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం

ఒత్తిడి లేకుండా ఎలా..

పదిలో ప్రతిభ కనబరచాలంటే అత్యధికంగా మార్కులు రావాల్సిందే. అందుకు విద్యార్థులు ఒత్తిడి పక్కన పెట్టాలి. అప్పుడే ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్ష రాయగలరు. ఒత్తిడి లేకుండా ఉండాలంటే అనుకున్న సమయం కన్నా 30 నిమిషాలు ముందుగానే ఇంటి వద్ద పనులు ముగించుకోవాలి. పరీక్షకు కావాల్సిన సామగ్రి ముందుగానే సిద్ధం చేసుకుని ఉండాలి. దూరం పరీక్ష కేంద్రం ఉన్న విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.

పరీక్ష కేంద్రాల స్కూల్స్‌లో తరగతులు ఇలా..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగే పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు మిగిలిన తరగతుల విద్యార్థులు పాఠశాలకు హాజరు కావాలి. పబ్లిక్ పరీక్ష, ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరిగే పరీక్షా కేంద్రాల్లో పరీక్ష తేదీల్లో పాఠశాల నిర్వహణ కుదరదు కనుక ఆ రోజు బదులు ఏప్రిల్ 23లోపు వచ్చే ఆదివారాల్లో పాఠశాలలను నిర్వహించాలని డీఈవో వెంకటరమణ తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకూడదు



విద్యార్థులు పరీక్షల గురించి ఎక్కువ ఆలోచిస్తూ ఒత్తిడికి గురికావొద్దు. ఒత్తిడి వల్ల వచ్చిన జవాబులు కూడా మరచిపోయే అవకాశం ఉంది. అందువల్ల పరీక్షకు వెళ్లే ముందు ప్రశాంతంగా ఉండాలి. రాత్రులు ఎక్కువసేపు మెలకువగా ఉండకుండా తొందరగా పడుకోవాలి. తెల్లవారుజామున సంబంధిత సబ్జెక్టును రివ్యూ చేసుకుంటే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది.

- వీఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయుడు

ప్రశ్న ఒకటికి పదిసార్లు చదువుకోవాలి..



విద్యార్థులు పరీక్ష కేంద్రంలో పరీక్షా పత్రాన్ని ఒకటికి పదిసార్లు జాగ్రత్తగా చదువుకుని అప్పుడు జవాబులు రాయాలి. కంగారు పడకుండా ఉండాలి. పరీక్షా సమయాన్ని చూసుకుంటూ ఉండాలి. తల్లిదండ్రులు ఇంట్లో పిలల్లు చదువుకునేందుకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలి. ఎండ తీవ్రత ఉంటున్న దృష్ట్యా మంచినీరు ఎక్కువగా తీసుకుంటే మంచిది. పరీక్షకు అరగంట ముందు పరీక్షా కేంద్రం వద్ద ఉండేలా చూసుకోవాలి. దీని వల్ల కొంత ఒత్తిడి తగ్గుతుంది.

- పి.శ్రీదేవి, ఉపాధ్యాయురాలు

కూటమిలో సయోధ్య

తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన ఇన్‌ఛార్జ్‌లు ఉత్తర, దక్షిణ ధృవాలుగా ఉంటారనుకున్నాం. ఇద్దరూ ఒక్కటైపోయారు. వాళ్లంతే. ఇది నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నేత తన అంతరంగికుల వద్ద అన్నమాట. తెలుగుదేశం, జనసేనల మధ్య క్షేత్ర స్థాయిలో అభిప్రాయ బేధాలు తలెత్తుతాయని, అది వైసీపీకి లాభిస్తుందని అధికార పార్టీ నేత ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు కథ అడ్డం తిరిగింది. రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. గెలుపే లక్ష్యంగా పూనుకున్నాయి. దానికి భారతీయ జనతా పార్టీ తోడైంది. ఉమ్మడి సభ కూడా నిర్వహించారు. అధికార పార్టీ శ్రేణుల్లో ఇప్పుడదే విషయం అలజడి రేపుతోంది. అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తోంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



- వైసీపీ అంచనాలు తల్లకిందులు
- క్షేత్ర స్థాయిలో ఒక్కటైన టీడీపీ, జనసేన,బీజేపీ
- అసంతృప్తితో రగిలిపోతున్న వైసీపీ

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ తెలుగుదేశం కూటమి మధ్య పొసగదని ఆశించారు. అందరి ఆశలు గల్లంతయ్యాయి. క్షేత్రస్థాయిలో తెలుగుదేశం-జనసేన కూటమి కలసి కట్టుగా ఉంది. ప్రచారం నిర్వహిస్తోంది. జనసేనకు సీట్లు కేటాయించిన చోట తెలుగుదేశం నాయకులకు చంద్రబాబు నుంచి గట్టి హామీ లభించింది. వాస్తవానికి తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన మధ్య టిక్కెట్ విషయంలో మంచి పోటీ ఉండేది. ఎవరికి టిక్కెట్ వస్తుందోనని అంతా ఉత్కంఠగా ఎదురు చూశారు. జనసేనకు కేటాయించడంతో తెలుగుదేశం ఎదురుతిరుగుతుందని అధికార పార్టీ నేతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ తెలుగుదేశం అధిష్ఠానం తాడేపల్లిగూడెం పార్టీ నాయకత్వానికి దన్నుగా నిలచింది. కూటమి విజయానికి కృషి చేస్తామంటూ ఇక్కడ నాయకత్వం అధిష్ఠానానికి హామీ ఇచ్చింది. జనసేన అభ్యర్థి బొలిశెట్టిని గెలిపించడమే తన ధ్యేయమంటూ టీడీపీ ఇన్‌చార్జ్ ఉమ్మడి సభలో ప్రకటించారు. అదే తరహాలో కూటమి శ్రేణులు అడుగులు వేస్తున్నాయి. అధికార పార్టీ అంచనాలు తల్లకిందులయ్యాయి.

నాయకులు వీడినా..

తణుకు నియోజకవర్గంలో తెలుగుదేశం కూటమి సీటును కేటాయించడంతో అక్కడ జనసేనలో కాస్త అలజడి రేగింది. ఆ తర్వాత అది సమసిపోయింది. క్షేత్ర స్థాయిలో జనసేన నాయకులు తెలుగుదేశం ఇన్‌చార్జ్‌తో కలసి పనిచేస్తున్నారు. ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రతి గ్రామంలోనూ ఇటువంటి కలయిక కనిపిస్తోంది. ఆచంటలో జనసేన ఇన్‌చార్జ్ చేగొండి సూర్య ప్రకాశ్ పార్టీని వీడారు. వైసీపీలో చేరారు. ఆయన ప్రభావం మచ్చుకైనా ఆచంటలో కానకరాలేదు. ఆచంట తెలుగుదేశం అభ్యర్థి , మాజీ మంత్రి పితాని వెంటే జనసైనికులు అడుగులు వేస్తున్నారు. ప్రచారంలో పాల్గొంటున్నారు. తెలుగుదేశం విజయానికి కృషి చేస్తున్నారు. పవన్ కల్యాణ్ అడుగులో అడుగు వేస్తామంటూ జనసైనికులు ఆచంటలో శపథం పూనారు. పార్టీని వీడిన నాయకునిపై దుమ్మెత్తిపోశారు. ఉండి నియోజకవర్గంలో తొలినుంచే తెలుగుదేశం, జనసేన శ్రేణులు ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నాయి. తెలుగుదేశం ఎంఎల్ఏ రామరాజు, జనసేన ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు చేతులు కలిపారు. కలిసి ప్రయాణం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. భీమవరంలో జనసేన అభ్యర్థిగా అంజిబాబును ప్రకటించడంతో వైసీపీ నాయకత్వంలో కంగారు మొదలైంది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భీమవరం నుంచి పోటీ చేస్తే ఆయనకు వ్యతిరేకంగా వైసీపీ అధిష్ఠానం ఆర్థిక వనరులు సమకూరుస్తుందని స్థానిక అధికార పార్టీ నాయకత్వం భావించింది. ఇప్పుడు కూటమి ప్రణాళిక మార్చుకుంది. జనసేనకు కేటాయిస్తూనే మాజీ ఎంఎల్ఏ అంజిబాబును రంగంలోకి దింపింది. తెలుగుదేశం అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మిని అంజిబాబు కలిశారు. దాదాపు గంటన్నర పాటు చర్చలు సాగాయి. తెలుగుదేశం నాయకత్వం , శ్రేణులు అంతా ఇప్పుడు అంజిబాబుకు మద్దతుగా ఉన్నారు. పాలకొల్లు నియోజకవర్గానికి వస్తే తెలుగుదేశం, జనసేనలు కలిసి ఉమ్మడి పోరాటాలు చేశాయి. ఇప్పుడు కూడా కలిసే పనిచేస్తున్నాయి. ఎంఎల్ఏ నిమ్మలకు మద్దతుగా జనసైనికులు నిలుస్తున్నారు. నర్సాపురంలో టిక్కెట్ ఎవరికి వచ్చినా సరే కలిసి పనిచేయాలంటూ ముందునుంచే తెలుగుదేశం, జనసేన నాయకులు ఒక అంగీకారంతో ఉన్నారు. తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, నాయకుడు కొవ్వలి నాయుడు, జనసేన ఇన్‌చార్జ్ బొమ్మిడి నాయకర్‌లు ఇదే పంథా అనుసరిస్తూ వచ్చారు. నర్సాపురం సీటు జనసేనకు కేటాయించడంతో అంతా కలసే పనిచేయాలని నిర్ణయిం చారు. పొత్తూరితో టీడీపీ అధినేత చంద్రబాబు ఫోన్‌లో సంప్రదించారు. ఇలా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి మధ్య సయోధ్య ఏర్పడింది. అదే ఇప్పుడు అధికార పార్టీని కలవర పెడుతోంది. మరోవైపు వైసీపీలో అసంతృప్తి తారస్థాయికి చేరుకుంది. అన్ని నియోజకవర్గాల్లోనూ అసంతృప్తితో అధికార పార్టీ నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

నేడు ఎస్పీ స్పందన రద్దు

భీమవరం క్రైం, మార్చి 17 : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమలులో ఉన్నందున ఈనెల 18వ తేదీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్టు జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బాట పేరుతో బాదుడు

- కరుగోరుమిల్లి ర్యాంపులో దోపిడీ
- ఇసుక లారీ యజమానుల గగ్గోలు
- అధికార పార్టీ నాయకులు దండా

పాలకొల్లు, మార్చి, 17 : ఆచంట నియోజకవర్గ పరిధిలోని కరుగోరుమిల్లి ఇసుక ర్యాంపులో నాలుగు రోజులుగా ఇసుక ఎగుమతులు అవుతున్నాయి. రోజుకి 70 నుంచి 80 లారీల ఇసుక తరలిపోతోంది. టన్ను ఇసుక రూ.475 వసూలు చేస్తుండగా బాట చార్జీల పేరుతో లారీకి రూ.200 వసూలు చేస్తున్నారని పలువురు లారీ యజమానులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బాట చార్జీలు వసూలు చేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నాయకులు ఈ దందా కొనసాగిస్తున్నట్టు చెబుతున్నారు.. జిల్లాలో భవన నిర్మాణాలు తగ్గి ఇసుకకు డిమాండ్ తగ్గిన పరిస్థితుల్లో సైతం ర్యాంపులలో దోపిడీ చేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మట్టి మాఫియాపై జిల్లా కలెక్టరు దృష్టి సారించి మట్టి అక్రమ రవాణాను అదుపు చేశారని ఇప్పుడు కరుగోరు మిల్లి ప్రాంతం నుంచి మట్టి అక్రమ రవాణాకు ప్రయత్నం చేస్తున్నారని, గోదావరి ఇసుక ఎగుమతి ముసుగులో గోదావరి బొండు తరలించడానికి ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. అక్రమ రవాణాను అడ్డుకోవాలని, నిబంధనలు అతిక్రమించి అక్రమ ఇసుక రవాణా, అక్రమ వసూళ్లు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిప్పర్ లారీ యజమానులు కోరుతున్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటికీ అధికార పార్టీ అరాచకాలు ఆగడం లేదని మట్టి, ఇసుక మాఫియాలు ఉమ్మడి జిల్లాలో చెలరేగిపోతున్నాయని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.





తొడగొడుతున్న యువతి..



పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం



ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదేలేదన్నట్టు తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. - చిలకలూరిపేట







ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు



ఉత్సాహంగా యువతులు..



బాబు, పవన్, పురంధేశ్వరి అభివాదం...



మోదీతో బాబు మాటామంతీ..





జానపదుల నృత్యాలు..



మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..



క్రైం కార్నర్

యజమాని తిట్టాడని వాటర్ ట్యాంకు ఎక్కాడు..

తణుకు, మార్చి 17 : తణుకు రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు.తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన యరమాటి సత్యనారాయణను తాను పనిచేస్తున్న యజమాని దుర్భాషలాడాడంటూ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న వాటర్ ఎక్కాడు. దీంతో పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కిందకు దించడానికి ప్రయత్నించారు. యజమాని దుర్గాప్రసాదు వచ్చి మాట్లాడిన తర్వాత కిందకు దిగాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నడిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నాలుగు కిలోల వెండి, ఐదు కాసుల బంగారం అపహరణ

పెదవేగి, మార్చి 17 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. తాళాలు పగుల గొట్టి, ఇంట్లో వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేశారు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నడిపల్లి గ్రామానికి చెందిన మేకా రమేష్ కుటుంబ సభ్యులంతా కలిసి వారంరోజుల కిందట హైదరాబాద్ వెళ్ళారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని గమనించిన స్థానికులు శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉన్న రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఆదివారం ఉదయానికి నడిపల్లి చేరుకున్న రమేష్ ఇంట్లో నాలుగు కిలోల బరువైన మూడు వెండి పళ్ళాలు, ఐదు కాసుల బంగారు ఆభరణాలు, రూ.ఐదువేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

పెదవేగి, మార్చి 17 : పెదవేగి మండలం చక్రాయగూడెంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్టు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన బోట్ల వీరమ్మ శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఏలూరు- జంగారెడ్డిగూడెం రహదారిని దాటుతోంది. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ప్రేమించి మోసగించిన యువకునిపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 17 : ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి ముఖం చాటేసిన యువకునిపై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన యువతి ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నది. నూజివీడు గాంధీనగర్‌కు చెందిన పురమా సాయిబాబు (30) తరచుగా పేషెంట్లను ఆ ఆసుపత్రికి తీసుకువస్తూ ఆ నర్సుతో పరిచయం పెంచుకుని ఆ పరిచయాన్ని ప్రేమగా మార్చాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఆమెను గర్భవతిని చేసి ఆపై అబార్షన్ చేయించాడు. పెళ్ళి మాటెత్తితే నిరాకరించాడు.దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు తలల పాము హతం



పోలవరం, మార్చి 17 : అరుదైన రెండు తలల పాముని పోలవరంలో గ్రామ స్థులు ఆదివారం ఉదయం చంపివేశారు. పోలవరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో స్టేట్ బ్యాంకు సమీపంలో పంటపొలాల నుంచి రోడ్డు దాటుతున్న రెండు తలల పాముని స్థానికులు ఇటుకలతో కొట్టి చంపారు. అటవీక్షేత్రాధికారి దావీదురాజు మాట్లాడుతూ రెండు తలల పాముగా పిలవబడే రెడ్ శాండ్ బోవా విష రహిత పాము అని ప్రమాదకారి కాదన్నారు. ప్రజలు అవగాహన లేక అరుదైన సర్ప జాతులను కొట్టి చంపుతున్నారన్నారు. నివాసాల పరిసర ప్రాంతాలలో పాములు కనిపించినప్పుడు అటవీశాఖ అధికారులకు సమాచారమిస్తే వాటిని తమ వద్ద ఉన్న నూతన పరికరాల ద్వారా పట్టి అడవుల్లో వదులుతామన్నారు.



ఏలూరులో పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరులో రూమ్ నంబర్లు తెలుసుకుంటున్న అభ్యర్థులు

గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతం

భీమవరం రూరల్ / ఏలూరు కలెక్టరేట్ /ఏలూరు క్రైం/ తాడేపల్లిగూడెం రూరల్ / భీమవరం క్రైం / నరసాపురం టౌన్ మార్చి 17 : ఉమ్మడి జిల్లాలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు, ఏలూరు జిల్లాలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా పశ్చిమలో 62.20 శాతం, ఏలూరులో 62.85 శాతం మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన ఉదయం పేపరు-1 పరీక్షకు 4,209 మంది దరఖాస్తు చేసుకోగా 2,618 మంది హాజరయ్యారని, 1591 మంది గైర్హా జరయ్యారని 62.20 శాతం నమోదైనట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మధ్యాహ్నం పేపరు -2 పరీక్షకు 4,209 మందికి 2596 మంది హాజరవగా 1613 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల అనం తరం ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామాగ్రి పూర్తి బందోబ స్తుతో స్ట్రాంగ్ రూమ్‌కి తదుపరి ఏపీపీఎస్సీ అధికారులు ప్రత్యేక భద్రతతో విజయవాడ తరలించనున్నట్టు తెలిపారు. ఏలూరు జిల్లాలో 4,371 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఉదయం 2747 మంది మధ్యాహ్నం 2732 మంది హాజరయ్యారు. మొత్తం 15 మంది గైర్హాజరైనట్టు జేసీ లావణ్య వేణి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాం తంగా పరీక్షల నిర్వహణ చేపట్టినట్లు తెలిపారు.ఏలూరులో పరీక్షా కేంద్రా లను జిల్లా ఎస్పీ ఆదివారం తనిఖీ చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా మెటల్ డిటెక్టర్‌లతో పరిశీలించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచీలు, సెల్ ఫోన్లు తీసుకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. నగరంలో ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భీమవరంలో పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు తనిఖీ చేశారు. ట్రాఫిక్ పోలీస్‌లు అభ్యర్థులకు ఏవిధమైన ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారని, తగిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినటు తెలి పారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళా శాలలో 52.5 శాతం మంది పరీక్షలకు హాజరైనట్టు పరీక్షల కేంద్రం సూపరింటిండెంట్ డాక్టర్ రత్నాకరావు తెలిపారు. ఉదయం 739 మందికి 662 మంది, సాయంత్రం 1401 మందికి 733 మంది హాజరైనట్టు వివరిం చారు. రూరల్ సీఐ రమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నరసాపురం వైఎన్ కళాశాలలో ప్రశాంతంగా ముగిశాయి. సెంటర్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు.







నరసాపురంలో చెక్ చేస్తున్న పోలీసు... భీమవరం డీఎన్ఆర్ వద్ద పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ... పెదతాడేపల్లి వాసవీ కళాశాల వద్ద అభ్యర్థులు

ఆన్‌లైన్ సేవల్లో ఇబ్బందులు

రుణాలకు సంబంధించి తరచూ ఫోన్‌లు

ఎస్‌బీఐ ఖాతాదారుల్లో అసహనం



పాలకొల్లు, మార్చి, 17: ఆన్‌లైన్‌లో నాణ్యమైన సేవలు అందడం లేదని తరచూ ఇబ్బందులు ఇదురవు తున్నాయని ఎస్‌బీఐ ఖాతా దారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా లోన్ అకౌంట్స్ ఈఎంఐల చెల్లిం పుల విషయంలో సాఫ్ట్‌వేర్ మరీ అధ్వానంగా తయారైందని పలువురు చెబుతున్నారు. ఇటీవల పాలకొల్లు ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌లో రామారావు అనే వ్యక్తి గృహ రుణం రూ.12 లక్షలు తీసుకున్నారు. 2022 ఆర్థిక సంవత్సరాంతానికి తీసుకున్న రుణంలో రూ.16 వేలు మాత్రమే బాకీ ఉంది. రుణ వ్యవధి ఎక్కువ కాలం ఉండటంతో ఈఎంఐ నామమాత్రం చేసి రూ.5 వందలుగా నిర్ణయించారు. గత ఫిబ్రవరి నెలాఖరు నాటికి తీసుకున్న రుణంలో రూ.4 వేలు మాత్రమే బాకీ ఉండగా ఈఎంఐ రూ.30,419 కట్టాలంటూ ఎస్ఎంఎస్ పంపించడమే కాకుండా సేవింగ్ ఖాతాను హోల్డ్ చేశారు. వాస్తవంగా బాకీ రూ.4 వేలు ఉన్నప్పటికీ రూ.30 వేలు బాకీ చూపి హోల్డులో పెట్టడంతో ఇబ్బంది పడ్డానని రామారావు తెలిపారు. మురళీకృష్ణ అనే వ్యక్తి తీసుకున్న గృహ రుణంపై నెలనెలా ఈఎంఐ చెల్లిస్తున్నప్పటికీ బ్యాంక్ నుంచి ఫోన్‌లు చేసి మీ ఖాతా ఖాళీ అయిపోతుందంటూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. రుణం తీసుకున్న బ్యాంక్ నుంచి ఒకసారి, హెడ్డాఫీసు నుంచి అంటూ ఒకసారి థర్డ్ పార్టీ వ్యక్తుల నుంచి మరోసారి ఫోన్‌లు చేసి నరకం చూపిస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగలు, పబ్లిక్ హాలీడేస్‌లలో ఫోన్ చేసి ఇబ్బంది పెట్టవద్దని రిజర్వ్ బ్యాంక్ గట్టిగా చెప్పినప్పటికీ పలు బ్రాంచ్‌లతో రాత్రనక పగలనక ఫోన్‌లు చేస్తూ ఇబ్బం దులు పెడుతున్నారని పలువురు రుణగ్రహీతలు వాపోతున్నారు.

కుమార్తెపై అత్యాచారయత్నం

ఆగిరిపల్లి, మార్చి 17: ఆగిరిపల్లి మండలంలోని ఒక గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికపై ఆమె తండ్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో అత్యా చారానికి యత్నించగా ఆమె భయపడి కేకలు వేసింది. కేకలు విన్న బాలిక పిన్ని రావడంతో తండ్రి పరారైనట్టు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ద్వారకా తిరుమలలో వీధి కుక్కల భయం



ద్వారకా తిరుమల, మార్చి17: డెర్మటైటిస్ వ్యాధి బారిన పడిన వీధి శునకాలు ద్వారకాతిరుమలలో స్థానికులను హడలెత్తిస్తున్నాయి. కొండపై అన్నప్రసాద భవనం వద్దకు వెళ్లిన ఓ భక్తుడిపై శునకం దాడి చేసి వేలు కొరకడంతో భక్తులు భయపడిపోతున్నారు. ఇక్కడ వీధి కుక్కలకు తీవ్రమైన చర్మవ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. శరీరంపై ఒంటినిండా పుండ్లు పడి వాటి నుంచి రక్తం కారుతూ అవి వికృతంగా మారాయి.ఇవి దగ్గరకు వస్తున్నాయంటేనే జనాలు భయాందోళనలతో పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే వీధికుక్కల ద్వారా ఈ స్కిన్ ఇన్ఫెక్షన్ కొన్ని పెంపుడు కుక్కలకు వాటి నుంచి యజమానులకు కూడా సోకింది. దీంతో వారు చికిత్స పొంది వాటిని దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విడుస్తున్నట్లు సమాచారం.

వ్యాధి తీవ్రత గుర్తించాలి

పంచాయతీ పరిధిలో వందలాదిగా సంచరించే శునకాల్లో అధికశాతం కుక్కలకు



డెర్మటైటిస్ బారిన శునకాలు

భయాందోళనలో ప్రజలు

ఈ చర్మవ్యాధి ఇప్పటికే సోకింది. చాలా రోజులుగా ఇవి వ్యాధి తీవ్రతతో బాధపడుతున్నా పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. పలుప్రాంతాల్లో ఇవి గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. వ్యాధిబారిన పడిన శునకం తిన్న ఆహారాన్ని, తాగిన వాటిని వేరే శునకం తింటే వాటికీ ఈ ఇన్ఫెక్షన్ సోకుతోంది.

ఇది అంటువ్యాధి



శునకాలకు వచ్చిన ఈ చర్మవ్యాధిని డెర్మటైటిస్ అంటారు. శుభ్రత లేని కారణంగా మరింతగా వాటికి బ్యాక్టీరియా సోకి చివరకు మృత్యువాత పడుతున్నాయి. పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్తలు పాటించాలి. ద్వారకాతిరుమలలో అధికశాతం కుక్కలకు ఈ వ్యాధి సోకింది. వేరే కుక్కలతో ఇవి తిరగడం వల్ల ఆ వ్యాధి వీటికీ అంటుతోంది.

- అంగర సురేష్, మండల పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల

వైభవంగా అలుగులమ్మ ఉత్సవాలు



ఉండి, మార్చి 17: అలుగులమ్మ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 14వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు 21వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 17వ తేదీ ఆదివారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, తీర్థప్రసాద వినియోగములు నిర్వహించారు. అనంతరం డోలు సన్నాయి, మేళతాళాలు, కాళికా నృత్యాలు, చిత్రవిచిత్ర వేషాలు, భక్తుల కోలాహలంతో అమ్మవారిని రథంపై ఊరేగించారు. తొలుత అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేడుకగా కోతిగుంట ఆంజనేయ స్వామి ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 17: తాడేపల్లిగూడెం మండలం మిలిటరీ మాధవరం కోతిగుంట ఆంజనేయస్వామి ఆలయ పునః నిర్మాణ అనంతరం ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. టీటీడీ వేద పండితులు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటా వైద్య సేవలు

తణుకు, మార్చి 17: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, పైడిపర్రు గ్రామాల్లో ఇంటింటా పర్యటించి పలువురికి వైద్య సేవలు అందించారు. వేల్పూరుకు చెందిన పుట్టా వెంకట చక్రధరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, అర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



పాలకోడేరు, మార్చి 17: త్వరలో జరగబోవు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలందరికీ పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని డీఎస్పీ వి. నారాయణస్వామి రెడ్డి, భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ అన్నారు. ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోనుటలో ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని భరోసా కల్పిస్తూ ఆదివారం నాడు పాలకోడేరులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పాలకోడేరు ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని మోగల్లు, కొండేపూడి, వేంద్ర గ్రామాలలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు, ఎఫ్ఎస్‌టీ టీమ్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

కాంగ్రెస్‌లో మహిళలు చేరిక

నరసాపురం టౌన్, మార్చి 17: పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలోకి 50 మంది మహిళలు చేరారు. వీరికి కాంగ్రెస్ నాయకుడు మోకా శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేశాయన్నారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ, ఉద్యోగాలు, పరిశ్రమలు లేకుండా చేసిందన్నారు.

వీఈసీ ప్రిన్సిపాల్‌గా కృష్ణకాంత్



వీరవాసరం, మార్చి 17: వీరవాసరంలోని వీఈసీ (వీరవాసరం ఎడ్యుకేషనల్ కమిటీ) జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్. కృష్ణకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఎయిడెడ్ జూనియర్ కళాశాలగా ఉన్న ఈ కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా యాజమాన్యం తరఫున మంచెం బలరాం వ్యవహరించారు. కృష్ణకాంత్ 2004లో ఎపిపిఎస్ ద్వారా ఎంపికై తూర్పుగోదావరిజిల్లా రాజవొమ్మంగి ప్రభుత్వ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకునిగా చేరారు. అనంతరం కృష్ణాజిల్లాలో ఆగిరపల్లి ,విజయవాడ ,కంచికచర్ల, మచిలీపట్నం కళాశాలలో పనిచేశారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ బోర్డులో రీడర్‌గా పని చేస్తూ పదోన్నత పై వీరవాసరం వీఈసీ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

ఇక నుంచి వీఈసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఎయిడెడ్ కళాశాలగా ఉన్న వీఈసీ జూనియర్ కళాశాల ప్రభుత్వ కళాశాలగా మారింది. విద్యా సంస్కరణలో భాగంగా ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వ పరం చేయటానికి కళాశాల యాజమాన్యం తొలుత అంగీకరించింది. అనంతర పరిణామాలలో కళాశాలను ప్రభుత్వపరం చేయటానికి కళాశాల పేరును మార్చాలని తిరకాసు పెట్టింది. ఇది తికమక వ్యవహారంగా మారింది. ఎయిడెడ్ సిబ్బందిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటంలోనూ, బదిలీలలో అవకాశం కల్పించటంలోనూ స్థానం కల్పించకపోవటంతో వారుకూడా త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. చివరకూ ప్రభుత్వ పరంగా ఈ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించటంతో తికమక తొలగి ప్రభుత్వ కళాశాలగా మారింది.

కోరుకొల్లు వాసికి గేట్‌లో 110వ ర్యాంక్



పాలకోడేరు, మార్చి 17 : గేట్ - 2024 ఫలితాలలో కోరుకొల్లు గ్రామానికి చెందిన గాదిరాజు సూర్యసాయి సుబ్రహ్మణ్యంరాజు ఆలిండియాలో 110వ ర్యాంక్ సాధించాడు. తల్లితండ్రులు గాదిరాజు రామాంజనేయరాజు, రేఖల కుమారుడు గాదిరాజు సూర్యసాయి సుబ్రహ్మణ్యంరాజు కోరుకొల్లు గ్రామం వాసి. ఎన్ఐటి వరంగల్‌లో సివిల్ ఇంజనీరింగ్‌లో ప్రథమ శ్రేణిలో పట్టాపుచ్చుకొని ప్రాంగణ నియామకం ద్వారా అయోధ్య శ్రీరామమందిర ప్రాజెక్టులో కొంత కాలం పనిచేశారు. గేట్ 2022 ఫలితాల ద్వారా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీలో ఉద్యోగం చేస్తూ ఈ సంవత్సరం జరిగిన గేట్-2024 సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 110వ ర్యాంక్ సొంతం చేసుకున్నాడు.

కూటమిపై నమ్మకంతోనే వలసలు



జనసేన పార్టీలో చేరిన సర్పంచ్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 17: రాష్ట్రాన్ని జగన్ సర్కార్ నాశనం చేస్తే పవన్ హయాంలో రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందన్న ఆశతో ప్రజ లంతా జనసేనలోకి వలసలు వస్తున్నారని తాడేపల్లిగూడెం కూటమి అభ్యర్థి, జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మోదుగగుంటలో సర్పంచ్ కట్టా జానకిరామయ్య, ఎంపీటీసీ దండుబోయిన వెంకట రమణ, మాజీ సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ శనివారం రాత్రి తమ అనుచరులతో భారీగా జనసేనలో చేరారు. జనసేన నాయకులు తోట గోపి, మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, పైబోయిన రఘు, నాయకులు అయినపర్తి వీరన్న, దాసరి చిలకరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 17: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లు చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తున్నట్టు తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో విద్యార్థులు సమయానికి పరీక్షలకు హాజరుకావాలని కోరారు.

ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేకే కూటమి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 17: రాష్ట్రంలో వైసీపీని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేకే ప్రతిపక్షాలు ఏకమై కూటమిగా వస్తున్నాయని మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను పరిచయం చేశారు. అప్పడా చైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వైసీపీ నాయకుల కొట్లాట

పెనుమంట్ర, మార్చి 17 : నత్తారామేశ్వరం గ్రామంలో వైసీపీ నాయకుల్లో వర్గపోరు తీవ్రమైంది. ఈనెల 9వ తేదీ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శూలాల ఉత్సవంలో తమదే పైచెయ్యిగా ఉండాలని ఇద్దరు వైసీపీ నాయకుల మధ్య తగాదా ఏర్పడింది. దానిని అక్కడి పెద్దలు ఆరోజు సర్ది చెప్పి పంపించారు. ఇది ఇలా ఉండగా శనివారంనాడు డ్వాక్రాలో లేని మహిళలకు చీరలు అందించే కార్యక్రమంలో ప్రాధాన్యత కోసం ఇరువురు మరోసారి పోటీ పడ్డారు. దీంతో ఇద్దరూ కలసి కొట్లాటకు సవాల్‌లు చేసుకున్నారని, కొట్టుకునేందుకు స్థలం కూడా నిర్ణయించుకున్నారు. ఇరువురు నాయకులు కలబడ్డారు. వారు కొట్టుకుంటున్న నేపథ్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువురితోపాటు మరి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. గాయాలపాలైన ఇద్దరి నాయకులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నరసాపురంలో అంబేద్కర్ విగ్రహానికి పొత్తూరి నివాళులు.. ఆచంట, భీమవరం, ఉండి ప్రాంతాల నుంచి చిలకలూరిపేటకు పయనమైన టీడీపీ శ్రేణులు

చిలకలూరిపేటకు టీడీపీ శ్రేణులు

నరసాపురం టౌన్, మార్చి 17: చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభకు తీర ప్రాంతం నుంచి ఆదివారం భారీగా టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో పట్టణ, మండలం, మొగల్తూరుకు చెందిన టీడీపీ నాయకులు ముందుగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి కార్లలో వీరంతా బయలుదేరివెళ్లారు. పార్టీ నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, వాతాడి ఉమా, ఆందే రామకృష్ణ, గుబ్బల నాగరాజు, జోగి పండు, కొల్లు పెద్దిరాజు, కత్తిమండ ముత్యాలరావు, షేక్ హుస్సేన్ ఉన్నారు.

ఆచంట: చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వాహనాల్లో తరలి వెళ్లారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ బహిరంగ సభకు అనేక మంది నాయకులు, కార్యకర్తలు వెళ్ళినవారిలో ఉన్నారు.

భీమవరం అర్బన్: చిలకలూరిపేట ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ శ్రేణులు తరలి వెళ్ళారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు త్వరలో విముక్తి లభించనుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెరగాని నారాయణమ్మ, బర్రె నెహ్రూ, ఐజాక్‌బాబు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, మాదాసు కనకదుర్గ, నసీమా బేగం, యలమంచిలి శ్రీను, మద్దుల సాయి పాల్గొన్నారు.

ఆకివీడు: బీజేపీ, టీడీపీ, జనసేన నేతృత్వంలో ఆదివారం చిలకలూరిపేటలో జరుగుతున్న ప్రజాగళం సభకు ఆకివీడు నుంచి భారీగా శ్రేణులు తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా పార్టీనాయకులు మాట్లాడుతూ రానున్నది కూటమి ప్రభుత్వమే అన్నారు. మరో రెండు నెలల్లో కూటమి అధికా రం చేపడుతుందని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

తణుకు: బొప్పూడి సమీపంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభకు తణుకు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హాజరయ్యే ఈ సభకు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన శ్రేణులను సమన్వయం చేసుకుని తరలి వెళ్ళారు.

ఉండి: మరో రెండు నెలల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మిత్రబృందం అధికారంలోకి రానుందని జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాసరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు జోస్యం చెప్పారు. ఆదివారం పార్టీ కార్యాలయం నుంచి చిలకలూరిపేట బహిరంగ సభకు బయలుదేరారు. బస్సులకు, కార్లకు వారు జెండాను ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, గురుగుబిల్లి సత్యనారాయణ, గోనబోయిన వెంకటేశ్వరరావు, మంతెన సాయిలచ్చిరాజు పాల్గొన్నారు.

గణపవరం: చిలకలూరిపేటలో ప్రజాగళం బహిరంగ సభకు గణపవరం మండలం నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు కార్లలో ర్యాలీగా తరలివెళ్ళారు. మండల పార్టీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, గణపవరం పట్టణ అధ్యక్షుడు సురేంద్రకుమార్‌రాజు, పట్టణ యువత అధ్యక్షుడు కాపారం చిన్న, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, పాల్గొన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి

నరసాపురం రూరల్, మార్చి 17: పట్టణ, మండలంలో సోమవారం నుంచి జరిగే పదోవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం తొమ్మిది కేంద్రాల్లో 2070 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. టేలర్, మిషన్, లెనిన్, కొత్తపల్లి, గౌతమి, సన్‌షైన్, సికిలీ, మండలంలోని తూర్పుతాళ్ళు, ఎల్‌బిచర్ల గ్రామాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో టేబుల్, మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అరగంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈవో పుష్పరాజ్యం సూచించారు.

ఆకివీడు: ఆకివీడు మండలంలో సోమవారం నుంచి పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ఎంఈవో ఏ.రవీంద్ర ఆదివారం తెలిపారు. మండంలో నాల్గు సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు.

కాళ్ళ: కాళ్ళ హైస్కూల్లో 340, కోపల్లె 320, కలవపూడిలో 138, ఏలూరుపాడు జెడ్పిహైస్కూల్‌లో 223 మంది చొప్పున మొత్తం 1022 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. 18 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ప్రతీరోజు ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు జరగనున్నాయి. 18న తెలుగు, 19న హిందీ, 20న ఆంగ్లం, 22న గణితం, 23న భౌతికశాస్త్రం, 26న బయాలజీ, 27న సాంఘీకశాస్త్రం పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

వీరవాసరం: మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలను పది పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. వీరవాసరంలో ఎంఆర్‌కే జడ్పీ హైస్కూల్, డివైన్‌మెర్సీ స్కూల్‌లోనూ, రాయకుదురు, కొణితివాడ, మత్స్యపురి జడ్పీహైస్కూల్‌లోనూ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. ఈ కేంద్రాలలో 572 మంది రెగ్యులర్ విద్యార్థులు, 284 మంది ప్రైవేట్ విద్యార్థులు వెరసి 856 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంలో పరీక్షలు జరగనున్నాయి. వీరవాసరంలోని జడ్పీహైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని ఉప విద్యాశాఖాధికారి శ్రీరాం ఆదివారం సందర్శించి పరిశీలించారు.

పాలకోడేరు: పాలకోడేరు మండల పరిధిలో ఐదు పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పివిఎస్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు, శృంగవృక్షం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మొత్తం 645 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు.



వీరవాసరంలో పరీక్షా కేంద్రం పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి శ్రీరాం, హెచ్ఎం

గణపవరం: ఈనెల 18 తేదీ సోమవారం నుంచి జరగబోయే 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో బాలయ్య తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 757 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. గణపవరం రెండు సెంటర్లు, పిప్పర రెండు సెంటర్లు, అర్థవరం, కాశిపాడు ఒక్కొక్క సెంటర్‌ల చొప్పున ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు.

నేడు ఆచంటలో ఉచిత వైద్య శిబిరం

ఆచంట, మార్చి 17: అమలాపురం కిమ్స్ వైద్య బృందం సహకారంతో సోమవారం స్థానిక కమ్మసంఘం కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైట్ల కిషోర్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగేఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

ఫ్లెక్సీల తొలగింపు



ఆకివీడు, భీమవరంలలో విగ్రహాలకు ముసుగు

ఆచంట, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ వచ్చినందున ఆదివారం కూడా మండలంలోని ఆయా చోట్ల పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను తొలగించారు. అలాగే వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు.

పెనుగొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఫ్లెక్సీలు, కటౌట్‌లు, జెండాలను తొలగించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ రాజకీయ నాయకుల విగ్రహాల కూడా ముసుగులు వేశారు.

ఆకివీడు: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆదివారం కూడా నగర పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీలు తొలగించడం, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. పూర్తిస్థాయిలో తొలగింపుకు చర్యలు చేపట్టామని కమిషనర్ జి.కృష్ణమోహన్ తెలిపారు.

భీమవరం టౌన్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు కావటంతోపట్టణంలోని వివిధ రాజకీయపార్టీల నాయకుల కట్టౌట్‌లు, బ్యానర్లను తొలగిస్తున్నారు. అదే విధంగా రాజకీయనాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఒక్కసారిగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు శుభ్రంగా మారిపోతున్నాయి. ఎన్నికల కోడ్ రావటంతో తొలగింపు చర్యలు చేపట్టారు. శనివారంనాడు పట్టణంలో కొంత భాగమే తొలగించారు. ఆదివారంనాడు ఉదయనుంచి సిబ్బంది తొలగింపుప్రారంభించారు. చివరకు శిలాఫకాలకు పైన కూడా చిత్రాలు ఉండటంతో వాటికి కూడా ముసుగులు వేశారు.

యాడ్ ఏజన్సీలకు నోటీసులు

ఎన్నికల కోడ్ అమలు జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు కడితే వాటిపై తప్పనిసరిగా ఫోన్ నెంబర్లుతోపాటు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మునిసిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదే విధంగా స్థానికంగా ఉన్న ఫెక్సీ ప్రింటర్‌లకు, ప్రింటింగ్ యజమానుల కూడా సమావేశం నిర్వహించి ఎన్నికల సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై వారికి వివరించారు.

పండ్లు పంపిణీ

భీమవరం అర్బన్, మార్చి 17: గొట్టుముక్కల వెంకటలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా విజ్ఞానవేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 7వ వార్డులోని కృపా కాలనీలో వృద్ధులు, పేదలకు చీరలు, పండ్లు, పౌష్టికాహరం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వాసర్ల ముత్యలరావు, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, ఇందుకూరి శివాజీ వర్మ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు

ఆకివీడు, మార్చి 17: దేశం కోసం జీవితాంతం తపించిన దేశ భక్తుడు, మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని ప్రముఖ పారిశ్రామికవేత్త చుండూరి వెంకట్రావు, నరేంద్ర మోదీ-గోకరాజు గంగరాజు సేవా సమితి ఫౌండర్, చైర్మన్ నేరెళ్ళ పెదబాబు అన్నారు. వెంకటలక్ష్మి రైస్‌మిల్లు ప్రాంగణంలో ఆకివీడు అబ్దుల్ కలాం ట్రస్టు, భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత దంత వైద్య శిబిరంలో 88 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు.

సాగుకు నీరందించాలి

ఇరగవరం, మార్చి 17 : సాగు నీరందించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆదివారం ఇరగవరంలో సీపీఎం మండల కమిటీ సమావేశం దంపనబోయిన విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కన్వీనర్ కామన మునిస్వామి మాట్లాడుతూ మండలంలో సాగునీరందక పంటలు ఎండిపోతూ నేలలు బీడు వారుతున్నాయని, అలాగే ప్రజలు తాగునీరందక అవస్థలు పడుతున్నారన్నారు. పంచాయతీల పరిధిలోని వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకపోవటంతో ప్రజలు ప్రైవేటు మంచినీటి కేంద్రాలపై ఆధారపడుతున్నారని కనీసం ట్యాంకర్ల ద్వారా నీరందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసిన ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలన్నారు. నాయకుడు పిల్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతో ముందుకెళ్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భీమవరం టౌన్, మార్చి 17: ఇక ముందు ఉద్యోగుల సమస్యల పై ఉద్యమాలతో ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పశ్చిమగోదావరి జిల్లా ఈసీ సభ్యుల సమావేశం నిర్ణయించింది. భీమవరం అంకాల ఆర్ట్అకాడమీలో ఆదివారం నిర్వహించిన ఈ సమావేశనకు రాష్ట్ర అధ్యక్షుడు కే.ఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార రావు, రాష్ట్ర సలహా మండలి సభ్యులు జి.సత్యనారాయణ, కమర్షియల్ టాక్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శ రమేష్ కుమార్, రాష్ట్ర ఆర్గ నైజింగ్ కార్యదర్శి నాగసాయి, రాష్ట్ర కార్యదర్శి బీహెచ్ రవీంద్ర రాజు, రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్, ఆర్టీసీ ఎంప్లాయీస్ నాయకులు కేదా ఈశ్వరరావు, కడప జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగుల సమస్యలు, పరిష్కారం గురించి తాలూకా, జిల్లా ఈసీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్చించారు. ఇక ముందు ఉద్యోగుల సమస్యలపై ఏ విధంగా ముందుకు వెళ్లాలి, జిల్లా తాలూకా స్థాయిల్లో అసోసియేషన్‌ను మరింతగా పటిష్టం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూర్య నారాయణ దిశ నిర్దేశం చేశారు.

నిమ్మల సూర్యకుమారి ఇంటింటి ప్రచారం



29వ వార్డులో ఓటర్లను కలసిన ఎమ్మెల్యే నిమ్మల సతీమణి సూర్యకుమారి

పాలకొల్లు టౌన్, మార్చి 17: టిడ్కో గృహాలను ఉచితంగా ఇస్తామంటూ మహిళలు, పేదలను జగన్ దగా, మోసం చేశారని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. పాలకొల్లు 29, 30వ వార్డులలో ఆదివారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆదివారం ఆమె ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పరితపించే కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడును గెలిపించాలని కోరారు. పాదయాత్రలో అడుగడుగునా మహిళలు సూర్యకుమారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పాలకొల్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, నాయకులు మజ్జి రవిశంకర్, నెలకుర్తి జనార్దన్, ధనాని సూర్యప్రకాష్, గుబ్బల వెంకటరమణ పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన

ఆకివీడు, మార్చి 17: భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలో శివరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వాహకులు అఖండ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు ప్రసాదాలు స్వీకరించారు.

వాహనాల తనిఖీ



గణపవరం, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు కోడ్ రావడంతో ఆదివారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, గణపవరం ఎస్సై పీ.వెంకటేశ్వరరావు నేతృత్వంలో పోలీసులు ఆదివారం రాత్రి పిప్పర మూడురోడ్ల సెంటర్‌లో వాహనాలను తనిఖీలు చేపట్టారు. తాడేపల్లిగూడెం, భీమవరం, గణపవరం, అత్తిలి, రోడ్ల కూడలిలోని పిప్పర వద్ద ఈ తనిఖీలు పెద్ద ఎత్తున నిర్వహించారు. రద్దీగా ఉండే ఈ రహదారుల్లో తనిఖీలు చేపట్టడంతో కాస్త ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

24న కోశాధికారి పదవికి ఎన్నికలు

పాలకొల్లు రూరల్, మార్చి 17: పాలకొల్లు టౌన్‌హాల్ కోశాధికారి ఎన్నికకు ఈనెల 24న ఎన్నికలు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌వీ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్‌హాలు ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పర్వం ముగిసిందని దీనిలో అన్ని పదవులు ఏకగ్రీవం కాగా కోశాధికారి పదవికి మాత్రం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోశాధికారి పదవికి రేపాక వెంకట రామనాధస్వామి, యాదంరెడ్డి శ్రీనివాసరావు పోటీలో ఉన్నారన్నారు. ఈఎన్నిక పూర్తవగానే అదే రోజు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం టౌన్‌హాలు నూతన కమిటీని ప్రకటిస్తామని తెలిపారు.

ఘనంగా సోమేశ్వర స్వామి కల్యాణం



పెంటపాడు, మార్చి 17: జట్లపాలెంలోని సోమేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామి వారి కల్యాణం ఆలయ ప్రధానార్చకుడు సుబ్రమణ్యశర్మ బ్రహ్మత్వంలో ఘనంగా జరిగింది. స్వామివారికి పంచామృతాభిషేకాలు, పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. భారీ అన్నసమారాధన జరిగింది. గ్రామస్థులు కుదుళ్ళ సోమేశ్వరరావు, కుదుళ్ళ శ్రీనివాసరావు, మదింశెట్టి రాంబాబు, ఆకుమూరి చినబాబు, బండి వెంకటేశ్వరరావు, కుదుళ్ళ చిన్న, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెనుమదం అమ్మవార్ల జాతర ప్రారంభం

పోడూరు, మార్చి 17: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లులుగా జననీరాజనాలు అందుకుంటున్న పెనుమదం శ్రీమహాలక్ష్మమ్మ, చల్లాలమ్మ, గంట్లమ్మ, ధనకొండ్లమ్మ, పోలేరమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర ప్రారంభమైంది. ఆదివారం వందలాది మంది మహిళలు బిందెలతో పసుపునీళ్ల తీసుకొచ్చి అమ్మవార్లకు జలాభిషేకం చేసి అమ్మవార్ల జాతరకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పెద్దచెర్వులో గంగమ్మకు పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి బిందెలలో నీళ్ల నింపుకుని పసుపు పోసి మహిళలు ప్రదర్శనగా వచ్చి చల్లాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి జలాభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మమ్మ, గంట్లమ్మ, ధనకొండ్లమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు జలాభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. ఈనెల 19న అమ్మవార్లను నడివీధికి తీసుకొచ్చి జాతరోత్సవాలు నిర్వహించనున్నట్లు కొళగారం కమిటీ చైర్మన్ కర్రే రామచంద్రరావు, మాజీచైర్మెన్ దేవరపు వీరరాఘవులు తెలిపారు.

వెంకన్న ఆలయంలో శివరామరాజు పూజలు



కాళ్ళ, మార్చి 17 : ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు ఆదివారం కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ నియోజకవర్గానికి 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు నియోవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ రెండుసార్లు తనను గెలిపించారని ఈసందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నారని ప్రతీ ఒక్కరూ తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆలయ ఈవో ఎం.అరుణ్‌కుమార్, దేవస్థానం మాజీ ఛైర్మన్ అడ్డాల గణపతిరాజు, శివరామరాజు సోదరులు వేటుకూరి కృష్ణంరాజు, వేటుకూరి సత్యనారాయణరాజు, గాదిరాజు పెద్ద లచ్చిరాజు, నంబూరి త్రినాథమూర్తి రాజుపాల్గొన్నారు.

సాహిత్య విశ్లేషకులు కొప్పర్తికి పురస్కారం



పాలకొల్లు, మార్చి 17: ప్రముఖ కవి, సాహిత్య విశ్లేషకులు కొప్పర్తి వెంకట రమణమూర్తికి ఆదివారం పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక అవార్డును పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో కొట్టి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. సాహిత్య రంగంలో విశేష కృషి సలిపిన విశిష్ట వ్యక్తులకు ఏటా పురస్కారాన్ని అందజేయా లనే ఉద్దేశంతో పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ తన తండ్రి స్వర్గీయ బ్రహ్మయ్య జ్ఞాప కార్థం ఈఏడాది కొప్పర్తికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కొప్పర్తి వెంకట రమణమూర్తి రచనలను, విశ్లేషణలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, భూపతిరాజు విశ్వనాథరాజు, యర్రంశెట్టి వెంకటరత్నం, రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, డాక్టర్ కెఎస్‌పిఎస్.వర్మ, పెనుమాక రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘ నాయకుడు ఆదినారాయణ వర్ధంతి

వీరవాసరం, మార్చి 17: నవుదూరు గ్రామంలో ఆదివారం రైతు సంఘం నాయకుడు కందుల ఆదినారాయణ 12వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరాం, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదినారాయణ ఆశయాలను సాధించటం కోసం ప్రతీ కార్యకర్త శ్రమించాలని కోరారు. జుత్తిగ నర్సింహమూర్తి, తాళ్ళూరి హరేరాం పాల్గొన్నారు.